దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ను బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయడానికి అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యమివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 19న సాయంత్రం 4 గంటలలోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

జిల్లాలో నేడు

నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

చేవెళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం స్థానిక కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏ.వీరేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తోపాటు అధికారులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.



యాచారం మండలం మేడిపల్లిలో ఏపుగా పెరిగిన వరి పంట



ఆశలు రేపిన నైరుతి

వానాకాలంలో విస్తారంగా వర్షాలు

ఈ వానాకాలం సీజన్ దాదాపు ముగిసింది. నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి త్వరలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. వానాకాలం సీజన్(నైరుతి కాలం)లో ఆశించిన స్థాయి కంటే అధికంగా వర్షాలు కురిశాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో గతేడాది కంటే దాదాపు 10శాతం అధికంగా సాగు పెరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అక్కడక్కడ కొంత పంటనష్టం జరిగినప్పటికీ మొత్తం మీద వానాకాలం సీజన్ ఆశాజనకంగా ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడి గణనీయంగా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలో అధిక వర్షపాతం నమోదు
- వికారాబాద్ జిల్లాలో 36శాతం అధికం
- గతేడాది కంటే 10శాతం పెరిగిన సాగు
- భారీగా దిగుబడి వచ్చే అవకాశం
- ఇటీవల కురిసిన వర్షాలతో కొంతమేర నష్టం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఈ వర్షాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో వరి సాగు అనూహ్యంగా పెరిగింది. సీజన్‌లో వికారాబాద్ జిల్లాలో 36శాతం అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. అలాగే సగటు కంటే రంగారెడ్డి జిల్లాలో 27శాతం, మేడ్చల్ జిల్లాలో 18 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. సాగు కూడా

మిగతా 7వ పేజీలో...



గాడిద పాలను పితుకుతున్న మహిళ

గాడిద పాలకు భలే గిరాకీ

లీటర్ ధర సుమారు రూ.10వేలు

- పిల్లల దగ్గు, దమ్ము నివారణకు వినియోగం
- నాందేడ్ నుంచి వచ్చిన 10 కుటుంబాలు
- ఊరూరు తిరుగుతూ అమ్మకాలు
- షాద్‌నగర్ ప్రాంతంలో విక్రయిస్తూ జీవనోపాధి

7

'గంగి గోవు పాలు గరిటెడైనను చాలు.. కడివెడైననేమి ఖరము పాలు' ఆవు పాల ముందు, గాడిద పాలు దేనికి పనికిరావని దీని అర్థం. ప్రముఖ కవి వేమన అన్న మాటలు నేడు తారుమారయ్యాయి. ఇప్పుడు గాడిద పాలకు ఆవుపాల కంటే మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. మామూలుగా గేదె, ఆవు పాలు లీటరుకు రూ.80 నుంచి రూ.100 వరకు ఉంటుంది. కానీ, గాడిద పాలు మాత్రం సుమారు రూ.10 వేలు పలుకుతోంది అంటే అతిశయోక్తి కాదు. ఇంత ధర ఏమిటి? వీటిని ఎందుకు వినియోగిస్తారు అని ఆలోచిస్తున్నారా? ఈ విషయాలతో పాటు షాద్‌నగర్ పరిసరాల్లో గల్లీగల్లీ తిరుగుతూ గాడిద పాలు విక్రయిస్తున్న వారి వివరాలతో ప్రత్యేక కథనం.

వైద్యానికి అడ్డాగా హైదరాబాద్

- ఈఎన్‌టీ డాక్టర్ల నైపుణ్యం అసాధారణం
- ఈ విభాగంలో గొప్ప పురోగతి సాధించాం
- వారంలో ఒకరోజు ఉచితంగా వైద్య సేవలందించాలి
- సౌత్‌జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శామీర్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే హైదరాబాద్ నగరం ప్రధాన వైద్య కేంద్రంగా మారిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా రోగులు చికిత్స నిమిత్తం ఇక్కడకు వస్తున్నారన్నారు. ప్రత్యేకంగా ఈశాన్య రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు నగరానికి వస్తున్నారని తెలిపారు. శుక్రవారం

మిగతా 6వ పేజీలో...



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నిధుల్లేవు.. పనులు కావు!

- పదేళ్లుగా పూర్తికాని సమావేశ మందిరం నిర్మాణం
- జిల్లా పరిషత్‌లో నిధుల కొరతే కారణమా?

8



యాచారం మండల కేంద్రంలో సమావేశ మందిరం పనులు ముందుకు సాగడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభించి పదేళ్లవుతున్నా నిర్మాణం పూర్తి కాలేదు. రూ.20లక్షల నిధులతో భవన నిర్మాణం ప్రారంభించారు. అయితే, జడ్పీలో నిధులు లేకపోవడంతోనే భవనం పూర్తి కాలేదని తెలుస్తుంది. భవన నిర్మాణానికి ఎంతమేర నిధులు అవసరమవుతాయో ఎస్టిమేషన్ ఇవ్వాలని జెడ్పీటీసీలు జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ, డీఈలకు సూచించినా ఫలితం లేకుండా పోయిందనే విమర్శలున్నాయి.

యాచారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి)



డ్రైనేజీ నీరు కలవడంతో మురుగు కూపంగా మారిన పులంధరి వాగు చెక్‌డ్యాం

మురుగు కూపంగా పులంధరి వాగు

ఆదిభట్లలోని కాలనీల మురుగంతా అందులోకే..

- చెక్‌డ్యామ్ నిండి అలుగుపారుతున్న డ్రైనేజీ వాటర్
- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- పశువులకు తాగునీటి ఇబ్బందులు

ఆదిభట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని పులంధరి వాగు మురుగు కూపంగా మారింది. చుట్టుపక్కల ఉండే గ్రామాలు, కాలనీల నుంచి వచ్చే వ్యర్థ జలాలు అందులోకి చేరి కంపుకొడుతున్నాయి. కనీసం పశువులు తాగేందుకు వీలు లేకుండా వాగులోని నీరు కలుషితమైంది.

ఆదిభట్ల, మంగల్‌పల్లి, బొంగ్లూరు, ఎంపీ పటేల్‌గూడ గ్రామాలు, కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు పులంధరి వాగులోకి చేరుతుంది. ఆదిభట్ల మున్సిపాలిటీలో ప్రారంభమయ్యే పులంధరి వాగు.. అబ్దుల్లాపూర్, హయత్‌నగర్ మండలాల మీదుగా భూదాన్ పోచంపల్లి, కొత్తగూడెం వద్ద మూసీ నదిలో విలీనం అవుతుంది. వందల కిలో మీటర్ల మేర ప్రవహించే ఈ వాగు నీరు అనేక చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు నింపుతుంది. గతంలో స్వచ్ఛమైన నీటితో పారేది. అలాంటిది నేడు మురికి కూపంగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. ఆదిభట్లలో పెద్ద కంపెనీలు, కార్పొరేటు స్థాయి విద్యా సంస్థల తోపాటు ప్రైవేట్ హాస్టళ్ల నుంచి వస్తున్న మురుగు పులంధరి వాగులోకి చేరుతుంది. దీంతో వాగు సమీపంలో వీర బ్రహ్మేంద్ర స్వామిని అనుగ్రహించిన మహిమాన్వితమైన మహమ్మాయి దేవి ఆలయంలో కాసేపు కూడా గడిపే పరిస్థితి లేదు. వాగు నుంచి వచ్చే దుర్గంధాన్ని భరిస్తూ రెండు నిమిషాలు కూడా ఆలయంలో కూర్చోలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాగులోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగంతా వాగులోకే..



పులంధరి వాగుపై మంగల్‌పల్లి మహమ్మాయిదేవి ఆలయం సమీపంలో నిర్మించిన చెక్‌డ్యామ్ మురుగు నీరు నిండి అలుగు పారుతుంది. గ్రామాలు, కాలనీలు, కార్పొరేట్ కళాశాలలు నుంచి వచ్చే మురుగంతా ఈ వాగులోకి చేరుతుంది. వాగు చెక్‌డ్యామ్‌లోకి మురుగు చేరడంతో పశువులు ఆ నీటిని తాగలేకపోతున్నాయి. భూగర్భ జలాలు సైతం కలుషితం అవుతున్నాయి.

సోమరాజు వినయ్, బీజేవైఎం నాయకుడు, ఆదిభట్ల మున్సిపాలిటీ

ఆహారం కల్తీ చేస్తే కఠిన చర్యలు

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలను కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఫుడ్ కమిషన్ చర్యలు చేపడుతుందన్నారు. ఆహార భద్రత చట్టం అమలులో ఎక్కడా అలసత్వానికి తావు లేకుండ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆహారాన్ని కల్తీ చేసి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తే ఎంతటి వారినైనా క్షమించేది లేదన్నారు. సంక్షేమ హాస్టళ్ల, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆయన సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు, చిన్నారులకు సక్రమంగా అందించాలన్నారు. నిరుపేదలకు ఆహార భద్రత కార్డుల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన మొత్తంలో రేషన్ సరుకులు ఇవ్వాలని సూచించారు. హోటళ్ల , రెస్టారెంట్‌ల యాజమాన్యాలు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా ఆహారం కల్తీ జరిగినట్లు గుర్తిస్తే కమిషన్ దృష్టికి తీసుకువస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెరువులు కబ్జా కాకుండా చూడాలి

- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెరువులు కబ్జా కాకుండా చూడాలని కలెక్టర్ శశాంక తెలిపారు. జిల్లాలోని చెరువుల సర్వే, ఎల్ఆర్ఎస్ 2020 దరఖాస్తుల పరిశీలనపై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఇరిగేషన్, సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువుల సర్వేను వేగిరం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో జాయింట్ సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలన్నారు. మ్యాప్‌ల ఆధారంగా సర్వే చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణను ఈపీఏ ద్వారా పారదర్శకంగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, ఎస్డీసీ కుమారి, ఆర్డీఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని కలెక్టర్ శశాంక తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ నుంచి 27వ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి పాటించాల్సిన విధివిధానాలపై ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహణకు రెండు రూట్లలో 11 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 8,800 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అనుమతిస్తారని, ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా ఎంట్రీ ఉండదని చెప్పారు. ఇబ్రహీంపట్నం సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 40మంది డిజేబుల్ చాలెంజ్ అభ్యర్థులు పరీక్ష రాయడానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెసులుబాటు కల్పించిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.


హైటెన్షన్ లైన్ వద్దు

» అలైన్‌మెంట్ మార్చాలని రైతుల డిమాండ్ » కడ్తాల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, నాయకులు

కడ్తాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగులో ఉన్న పంట పొలాల మీదుగా హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయవద్దని కోరుతూ కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు, నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. హైటెన్షన్ పోల్స్ వేసే అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కడ్తాల గ్రామాన్ని అనుసరించి 66 సర్వే నెంబర్‌లోని 150 మంది రైతులకు సంబంధించిన పొలాల మీదుగా 765 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్అండ్‌టీ సంస్థ శ్రీకారం చుట్టింది. ఇందుకోసం లైన్ మార్కింగ్ కూడా చేశారు. బీదర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఏర్పాటు చేసే కొత్త హైటెన్షన్ లైన్‌ను పొలాల మీదుగా ఏర్పాటు చేస్తే కోట్ల రూపాయల విలువ చేసే భూములను కోల్పోయి రోడ్డున పడుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి దూరంగా లైన్‌లు ఏర్పాటు చేయాలని, సర్వేను నిలిపివేయాలని కోరుతూ తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు కడారి రామకృష్ణ, జంగారెడ్డి, రాములు, బ్రహ్మచారి, వెంకట్రాములు, శ్రీరాములు గౌడ్, కేశవులు, గణేశ్, వెంకటయ్య, యాదయ్యగౌడ్, రాజేందర్, రాజేశ్, నర్సింహ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

శంకర్‌పల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారు. మండలంలో నిర్మాణంలో ఉన్న పనులను పూర్తిచేయాలన్నారు. వర్షాల వల్ల పాడైన రోడ్లకు మరమ్మతు చేయాలని ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కరించడంతో పాటుగా, ఉపాధిహామీ పథకం పనుల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవోలు వెంకయ్యగౌడ్, హిమబిందు, సంధ్య, అపర్ణ, కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే మహిళాభివృద్ధి

పరిగి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే మహిళాభివృద్ధి సాధ్యమని పరిగి ఇన్‌చార్జి ఎంఈవో గోపాల్, హెచ్‌ఎం గోపాల్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరిగిలోని బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల అక్షరాస్యత కోసం ప్రభుత్వాలు కూడా కృషి చేస్తున్నాయని తెలిపారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శ్వేత


పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

ధారూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామని ధారూరు పశువైద్యాధికారి శ్వేత తెలిపారు. మండల పరిధిలోని ధారూరు, దోర్నాల్, మైలారం గ్రామంలో శుక్రవారం ఆమె పశువైద్య సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆవులు, ఎడ్లు, గేదెలకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని సూచించారు. ధారూరు, దోర్నాల్, మైలారం గ్రామాల్లో 1050 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ శ్యామరావు, సిబ్బంది బాబురావు, రమేశ్, భీమయ్య, యాదయ్య, అమృతయ్యలు పాల్గొన్నారు.

వైద్యానికి అడ్డాగా హైదరాబాద్

(5వ పేజీ తరువాయి)

శామీర్‌పేట మండలం తూంకుంట పరిధిలోని అలంకృత రిసార్ట్‌లో నిర్వహించిన సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్-2024కు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వైద్య రంగంలో ఈఎన్‌టీ సర్జన్స్ అసాధారణ నైపుణ్యం, నిపుణుల సామర్థ్యానికి ప్రజల నుంచి మంచి గుర్తింపు లభిస్తోందన్నారు. ఈ సదస్సు వైద్యపరమైన ప్రయత్నం మాత్రమే కాదని, ఇది అత్యున్నత విజ్ఞాన వేదికన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఈఎన్‌టీలో అధునాతన అభివృద్ధి

ఈ సదస్సు ఈఎన్‌టీ వైద్య రంగంలో అధునాతన పురోగతిపై చర్చించేందుకు ఏర్పాటు చేసినట్లు గవర్నర్ తెలిపారు. వైద్య రంగంలో ఈఎన్‌టీ విభాగం గొప్ప అభివృద్ధిని సాధించిందన్నారు. న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, తల, మెడ శస్త్ర చికిత్స వంటి సూపర్ స్పెషలిస్టులు పనిచేయడానికి అనుమతిస్తున్నారన్నారు. ఈ సదస్సుకు దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి అధ్యాపకులు రావడం గొప్ప ఆలోచనల మార్పిడికి ఒక వేదికగా నిలిచిందన్నారు.

నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉంచాలి

నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అవసరమైన వారికి అందుబాటులో ఉండాలని, ధరలను గణనీయంగా తగ్గించాలని గవర్నర్ హితవు పలికారు. అసోసియేషన్ ఆఫ్ ఓటలారింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్‌జోన్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ దీనదయాళ్ మాట్లాడుతూ ఈ ఈవెంట్ సాంకేతికత, ఈఎన్‌టీ సేవలను ఎలా మారుస్తోందో అన్వేషించే కీలకమైన పరిస్థితులను సూచిస్తుందని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైద్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చబోతుందని తెలిపారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా ఈఎన్‌టీ వైద్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేస్తున్న కార్తీక్ ఆర్యన్

సినీహీరో కార్తీక్ ఆర్యన్ సందడి

విద్యార్థులతో కలిసి డ్యాన్స్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ సినిమా భూల్ భులయ్యా-3 సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆ మూవీ హీరో కార్తీక్ ఆర్యన్ శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్ఎస్ ఇంటర్‌నేషనల్ పాఠశాలకు విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు సినీ తార విద్యాబాలన్ రావాల్సి ఉండగా ఇతర కారణాలతో ఆమె హాజరు కాలేదు. ఈ సందర్భంగా హీరో కార్తీక్ ఆర్యన్ సినిమా బృందంతో కలిసి విద్యార్థులను ఉత్రూతలూగించించారు. అదే సమయంలో విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేశారు. విద్యార్థులకు తన ఆటోగ్రాఫ్‌తో ఉన్న టీషర్ట్‌లను అందజేశారు. అలాగే విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ అలరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఏడీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష పవిత్రమైనది

చిలుకూరు నుంచి శబరిమలకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప స్వాములు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో అయప్ప దీక్ష తీసుకొని పాదయాత్రగా అయ్యప్పను దర్శించుకునేందుకు బయలుదేరడం ఎంతో మంచి శుభపరిణామమని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు. శబరిమలలోని స్వామి దర్శనానికి ఇక్కడి నుంచి కాలినడకన బయలుదేరడం ఎంతో సాహసంతో కూడిన పని అని అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి విజయభార్గవ రెడ్డి, కుమ్మరి శివశంకర్ అధ్వర్యంలో శ్రీ హనుమద్వజ శబరిమల వరకు మహా పాదయాత్రను శుక్రవారం ప్రారంభించారు. ఈ యాత్రలో దాదాపు 21 మంది అయ్యప్ప స్వాములు ఉన్నారు. యాత్రను రంగరాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. పాదయాత్ర విజయవంతం పూర్తి చేసికొని రావాలని ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో కేశవ్‌గురు స్వామి, మాజీ ఎంపీటీసీ సహదేవ్ గౌడ్, భక్తులు ఉన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

డీఎంహెచ్‌వో రఘునాథస్వామి



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రఘునాథస్వామి

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): క్షయ, తదితర వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, వాటిని నివారించడానికి ముందస్తు చర్యలు తీసుకోవచ్చునని జిల్లా వైద్యాధికారి రఘునాథ స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రిలోని ప్యాలియేటీవ్ కేర్ విభాగాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి పండ్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అవగాహన కలిగిన తరం, దీర్ఘకాలిక వ్యాధుల పెరుగుతున్న తరంగాన్ని ఎదుర్కొవడానికి అవసరమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు కౌశిక్, మల్లీశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

యాచారం వాసికి అత్యున్నత పదవి

కాకతీయ విశ్వవిద్యాలయం వీసీగా ప్రతాప్‌రెడ్డి



కర్నాటి ప్రతాప్ రెడ్డి

యాచారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యాచారం పంచాయతీ పరిధిలోని గాండ్లగూడకు చెందిన కర్నాటి ప్రతాప్‌రెడ్డి అత్యున్నత పదవిని అలంకరించారు. ఆయన వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ప్రతాప్‌రెడ్డి ఒకటి నుంచి ఏడో తరగతి వరకు యాచారం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు. 8 నుంచి 10వ తరగతి వరకు ఆయన అమ్మమ్మ గ్రామమైన మాడ్గులలో చదివారు. ఇంటర్మీడియట్ మలక్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ, పీజీ ఉస్మానియ వి శ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. చాలాకాలం ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీకి వీసీగా నియమించింది. ఆయన తరచూ యాచారం వచ్చి తన వ్యవసాయ పనులను పర్యవేక్షించి వెళ్తుంటారు.


3 కేజీల బంగారంతో పరారీ?

ఫైనాన్స్ సంస్థ మేనేజర్ పనేనని గుసగుసలు

వికారాబాద్, అక్టోబర్ 18 : వ్యక్తిగత అవసరాల కోసం ప్రజలు బంగారాన్ని ప్రైవేటు దుకాణాలు, బ్యాంకులు, బంగారం ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెడుతుంటారు. అయితే ఇక్కడ ఓ బంగారం ఫైనాన్స్ సంస్థ మేనేజర్ అందులో తాకట్టు పెట్టిన బంగారానికే ఎసరు పెట్టాడు. ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా మూడు కిలోల బంగారాన్ని కాజేసిన సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వికారాబాద్ పట్టణంలో ఓ ప్రధాన బంగారం ఫైనాన్స్ సంస్థలో వికారాబాద్ ప్రాంతానికి చెందిన కొందరూ వారి బంగారాన్ని తాకట్టు పెట్టారు. ఈ క్రమంలో రాజేందర్‌రెడ్డి అనే వ్యక్తి 7తులాల బంగారం తాకట్టు పెట్టి రూ. 3.30 లక్షలు తీసుకున్నాడు. ఆ డబ్బును చెల్లించేందుకు అక్కడకు వెళ్లగా రేపు రండి.. మాపు రండి అంటూ తిప్పడంతో పాటు సర్వర్ సమస్య ఉందని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశాడు ఆ సంస్థ మేనేజరు. పొంతన లేని సమాధానాలు చెప్పడం, సిబ్బంది గుసగుసలాడుకోవడాన్ని గమనించి గట్టిగా నిలదీయడంతో సదరు బాధితుడికి అర్థమైంది. అయితే అందులో బ్యాంక్ మేనేజర్‌గా పని చేసిన పక్కా రాష్ట్రానికి చెందిన వ్యక్తి 60 ప్యాకెట్లు సుమారు 3 కిలోల బంగారం ఎత్తుకెళ్లినట్లుగా అక్కడి సిబ్బంది చెవులు కొరుక్కోవడం వినిపించింది. వినియోగదారులు, మీడియా ప్రతినిధులు సంస్థ దగ్గరికి వెళ్లగా లోపలికి అనుమతించకుండా తలుపులు మూసి వేశారు. ఆ సంస్థలో పనిచేసే వారు హుటాహుటిన సంస్థకు తాళం వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్‌ను వివరణ కోరగా అలాంటిదేమీ తమ దృష్టికి రాలేదని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. అయితే పోలీసులు సదరు బ్యాంక్ వద్దకు వచ్చి వెళ్లారని బాధితులు చెప్పడం కొసమెరుపు.

గాడిద పాలకు భలే గిరాకీ

- లీటర్ ధర సుమారు రూ.పది వేలు
- పిల్లల దగ్గు, దమ్ము నివారణకు వినియోగం
- నాందేడ్ నుంచి వచ్చిన 10 కుటుంబాలు
- ఊరూరు తిరుగుతూ గాడిదపాల అమ్మకాలు
- షాద్‌నగర్ ప్రాంతంలో విక్రయిస్తున్న 10 కుటుంబాలు



గాడిద పాల విక్రయం కోసం ప్రచారం చేస్తున్న మహిళ

కొత్తూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సాధారణంగా వర్షాకాలం, శీతాకాలంలో చిన్నపిల్లలు, వృద్ధుల్లో దగ్గు, జలుబు కనిపిస్తుంటాయి. వీటి నిర్మూలనకు మందులు వాడడం కంటే ఒకటి రెండు స్పూన్ల గాడిద పాలు తాగితే ఉపశమనంతో పాటు ఆ సీజన్‌వరకు ఆ వ్యాధులు దరిచేరవని చాలా మంది నమ్ముతుంటారు. ఇదే అదునుగా భావిస్తున్న గాడిదల యజమానులు వాటి పాలను మిల్లీలీటర్లలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గాడిదతో వీధుల్లో తిరుగతూ మైక్ ద్వారా దగ్గు, జలుబు, నిమ్ము, గురక, పెద్దలకు దమ్ము, దగ్గు, నీరాసం వంటి వ్యాధులకు గాడిద పాలు ఎంతో భాగా పనిచేస్తాయని ప్రచారం చేస్తూ విక్రయిస్తున్నారు. రోజుకు 100 నుంచి 150మిలీల గాడిదపాలను విక్రయిస్తూ రూ.1,500 వరకు సంపాదిస్తున్నారు.

నాందేడ్ టూ షాద్‌నగర్

వర్షం కాలం వచ్చిందంటే చాలు మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన పలు కుటుంబాలు గాడిదలను తీసుకుని రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గాడిద పాలను విక్రయిస్తున్నారు. సుమారు 10 కుటుంబాలు 20 గాడిదలతో షాద్‌నగర్ ప్రాంతంలో తాత్కాలిక నివాసం ఏర్పరుచుకున్నారు. అక్కడి నుంచి ఒక్కొక్కరు ఒక్కో గ్రామంలో సంచరిస్తూ.. మైక్ ద్వారా గాడిద పాలతో దమ్ము, దగ్గు దరిచేరవంటూ ప్రచారం చేస్తూ విక్రయిస్తున్నారు. సుమారు 3మి.లీ నుంచి 5 మి.లీలను అవసరమైన వారికి విక్రయిస్తూ రూ.150 నుంచి రూ.200 వరకు తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఒక్కొరు సుమారు పది నుంచి పదిహేను మందికి పాలను విక్రయిస్తూ రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు సంపాదిస్తున్నారు.

ప్రజలు నమ్మకంతో కొంటారు



తాతాల కాలం నుంచి మేము గాడిద పాలు విక్రయిస్తున్నాం. మా ప్రాంతంలో గాడిద పాలను నమ్మకంతో కొని పిల్లలకు తాగిస్తారు. వర్షం కాలంలో ఇక్కడ వచ్చి చలి కాలం తర్వాత తిరిగి మా ఊరికి వెళ్లిపోతాం. ఇంటింటికి వెళ్లి అవసరమైన వారికి పాలు విక్రయిస్తాం. కల్తీ లేకుండా అప్పటికప్పుడు పాలు పితికి తాగిస్తాం. దగ్గు, జలుబు, నిమ్ము, గురకలతో బాధ పడుతున్న చిన్నారులకు గాడిద పాలు ఎంతో మేలు చేస్తాయి. దగ్గు, దమ్ము ఉన్న పెద్దలు కూడా గాడిద పాలను సేవిస్తారు. రోజుకు ఒక గాడిద ద్వారా రూ.15 వందల వరకు ఆదాయం వస్తుంది. - శేషమ్మ, గాడిద పాల విక్రయరాలు, నాందేడ్

డాక్టర్లు ఎప్పుడూ సూచించలేదు



గాడిద పాలకు మెడిసిన్‌గా ప్రభుత్వం నుంచి ఏటువంటి గుర్తింపు లేదు. గాడిద పాలు తాగడం వలన దగ్గు, దమ్ము తగ్గుతుందనేది కొంత మంది ప్రజల నమ్మకం. చిన్నారులకు గాడిద పాలు తాపించాలని డాక్టర్లు ఎప్పుడూ ఎవరికీ సలహాలు, సూచనలు చేయలేదు.

- డాక్టర్ హరికిషన్, కొత్తూర్ పీహెచ్‌సీ

విద్యావికాస్ సమితి ట్రస్టు భూములను కాపాడాలి

పోలీస్ రక్షణ కల్పించాలన్న ట్రస్టు చైర్‌పర్సన్ శశిప్రభ

తాండూరు, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు విద్యా వికాస్ సమితి ట్రస్టుకు చెందిన 33 ఎకరాల ఆస్తులను కాపాడుకునే విషయంలో తనకు పోలీస్ రక్షణ కల్పించాలని మాజీ మంత్రి మాణిక్ రావు సతీమణి, ట్రస్టు చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శశిప్రభ మాణిక్‌రావు కోరారు. ఆమె శుక్రవారం హైదరాబాద్‌లో డీజీపీని కలిసి భూమికి సంబంధించిన వివరాలను అందజేసి పోలీస్ రక్షణ ఇప్పించాలని కోరారు. అనంతరం ఆమె మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రస్టు భూమి సుమారు రూ.250 కోట్ల విలువ ఉంటుందని, దాన్ని కాజేసేందుకు చాలా మంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా ఉండే కొంత మంది వ్యక్తులతో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వివరించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో చైర్మన్‌తో పాటు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ సమితి సభ్యులు చిన్నారెడ్డి , డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, న్యాయవాది రామకృష్ణ, సమితి మరో సభ్యులు రాఘవేందర్ ఉన్నారు. ఈ మేరకు స్పందించిన డీజీపీ విచారణ జరిపించాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు.

ఆశలు రేపిన నైరుతి

(5వ పేజీ తరువాయి)

గత ఏడాది కంటే పెరిగినప్పటికీ లక్ష్యాలను మాత్రం దాట లేదు. ఈ సీజన్‌లో రైతులు వికారాబాద్ జిల్లాలో 92.83 శాతం, రంగారెడ్డి జిల్లాలో 82.23 శాతం, మేడ్చల్ జిల్లాలో 93.10 శాతం పంటలు సాగు చేశారు. గతేడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంటలు సాగు పెరిగింది. దీనికి అనుగుణంగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచారు. అయితే ఈ పెంచిన లక్ష్యాల మేర పంటలు సాగు పెరగలేదు. కానీ గత ఏడాది కంటే 10శాతం అధికంగా సాగు చేశారు.

సాగులో సగం సన్నాలే..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 30శాతం అధికంగా వరి సాగు చేయడం గమనార్హం. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండాయి. దీంతో మూడు జిల్లాల్లో సెప్టెంబరు నెలలో సగటుకు మించి రైతులు వరి సాగు చేశారు. సన్న రకం వరిని సాగు చేసే రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500లు బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వరి సాగుపై మరికొందరు ఆసక్తి చూపారు. వరి సాగులో దాదాపు సగానికిపైగా సన్నాలు సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. సీజన్ ఆరంభంలో ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు కూడా గణనీయంగా పెరుగుతుందని ఆశించినప్పటికీ ఒక వికారాబాద్ జిల్లాలో మాత్రమే సగటుకు మించి సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు తగ్గింది. దీనికి తోడు భారీ వర్షాలతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 3వేల ఎకరాలకు పైగా పత్తి పంట వర్షాలకు దెబ్బతింది.

వానాకాలం సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

జిల్లా	సాధారణం	ప్రస్తుతం	శాతం
రంగారెడ్డి	3,96,899	326385	82.23
వికారాబాద్	5,77,508	536088	92.83
మేడ్చల్	23,026	21437	93.10

వానాకాలం వర్షపాతం(మి.మీలలో)

జిల్లా	సగటు	ఈ సీజన్‌లో	అధిక శాతం
రంగారెడ్డి	571.3	723.3	27
వికారాబాద్	665.2	903.4	36
మేడ్చల్	635.4	751	18

దిగుబడి పెరిగే అవకాశం

ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు ఆశాజనకంగా ఉండడంతో పంట దిగుబడి గణనీయంగా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలకు కొన్ని చోట్ల పత్తి పంట దెబ్బతిన్నప్పటికీ ఎక్కువ చోట్ల బాగానే ఉంది. వికారాబాద్ జిల్లాలో దాదాపు 2.41లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి పంట వేశారు. మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో పాటు పరిస్థితులు ఆశాజనకంగా ఉండడంతో పత్తి వేసిన రైతులు సంతోషపడుతున్నారు. భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో వరి దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉంది. కంది, మొక్కజొన్న, జొన్న పంటల దిగుబడి కూడా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

డిజిటల్ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద వికారాబాద్ మున్సిపాలిటీలో డ్రోన్ కెమెరాల సహాయంతో చేపట్టిన డిజిటల్ సర్వేకు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ప్రతీ ఒక్కరూ సహకరించాలని అదనపు కలెక్టర్ సుధీర్ కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో డిజిటల్ సర్వే విషయంపై నిర్వహించిన అత్యవసర సమావేశనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ అందించే సహకారంలో భవిష్యత్ తరాలకు మంచి భవిష్యత్తును ఇస్తుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేశ్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌తో వికారాబాద్ బల్దియాలో ఎక్కడ ఏమేమి ఉన్నాయో మొత్తం డిజిటలైజ్ చేయడమే కాకుండా భవిష్యత్తు తరాలకు ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఇన్‌చార్జి కమిషనర్ రాకేశ్‌రెడ్డి, డీటీసీపీ అధికారులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



వికారాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా 3వ మహాసభలు ఈనెల 19, 20 తేదీల్లో తాండూరు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటరాములు, జగదీశ్ పాల్గొంటారని తతెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సతీష్, నాయకులు అక్బర్, నవీన్, యాదయ్య, జంగయ్య, దశరథ్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ససేమిరా..!

- డిజిటల్ పంట సర్వేకు చేయలేమంటున్న ఏఈఓలు
- ఒక్కరితో సాధ్యం కాదంటున్న వ్యవసాయ విస్తరణ అధికారులు
- ప్రభుత్వ ఆదేశాలు పాటించాలంటున్న ఉన్నతాధికారులు
- లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరికలు



మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిజిటల్ పంట సర్వే చేపట్టేందుకు వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓలు) ససేమిరా అంటున్నారు. సర్వే తప్పని సరిగా చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా ఏఈఓలు మాత్రం ముందుకు రావడం లేదు. ఇంత పెద్ద పని తమ ఒక్కరి వల్ల సాధ్యం కాదని మొండికేస్తున్నారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం విధుల్లో పాల్గొనని ఏఈఓలందరికీ మెమోలు జారీ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. అయినా స్పందించకపోతే నిబంధనల ప్రకారం ఒకటి, రెండు రోజుల్లో షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

యాప్‌లోనే అటెండెన్స్..

గతంలో తమ హాజరు నమోదు చేసుకునేందుకు ఏఈఓలు రైతు వేదికలు లేదా క్లస్టర్లలోని కార్యాలయాలకు వెళ్లేవారు. డిజిటల్ క్రాప్ సర్వే అంశం తెరపైకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికింది. డిజిటల్ క్రాప్ సర్వే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆ లింక్ ద్వారా హాజరు వేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టింది. పది రోజులుగా ఏఈఓలు సర్వేకు వ్యతిరేకంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోకపోవడంతో ఆయా క్లస్టర్ల ద్వారా వాళ్లు విధుల్లో పాల్గొననట్లు పరిగణిస్తున్నారు. విధులకు హాజరై అన్ని పనులు చేస్తున్నా.. ఒక్క సర్వేలో పాల్గొనకుంటే విధులకు హాజరుకానట్లు ఎలా ఎలా పరిగణిస్తారని ఏఈఓలు ప్రశ్నిస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను వెంటనే డౌన్ లోడు చేసుకుని సర్వే మొదలు పెట్టాలని లేకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా ఏఈఓలు మాత్రం తమ ఇబ్బందులు తమకున్నాయని సర్వే తమ వల్ల కాదని మొండికేస్తున్నారు. దీంతో మొండికేస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

సర్వే చేయకపోతే చర్యలు



ఏఈఓలు డిజిటల్ పంట సర్వే చేయాల్సిందే. ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందే. వారు వెంటనే సర్వేలో పాల్గొనాలని చెప్తున్నాం. ఒకటి, రెండు రోజుల్లో సర్వేలో పాల్గొనకపోతే చర్యలు తప్పవు. - కె.చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారిణి

ప్రజావాణి వల్లే భూమి పట్టా పాస్‌బుక్

సంతోషం వ్యక్తం చేసిన ఏదులాబాద్ మహిళ

బేగంపేట, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రజాభవన్‌లో ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం వల్ల మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి ఇటీవల భూమి పట్టాదారు పాసు పుస్తకం అందింది. దీంతో శుక్రవారం ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఏదులాబాద్‌కు చెందిన వేణుగోపాలచారి, రుక్మిణి దంపతులు వచ్చి అధికారులను కలిసి అభినందనలు తెలిపారు. 2021 నుంచి మూడేళ్లుగా 16 గుంటల భూమి ధరణిలో నమోదు కాలేదని, దాంతో పట్టా పాస్‌బుక్ ఇవ్వలేదన్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి వినిగిపోయామని రుక్మిణి తెలిపారు. చివరగా న్యాయం కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నామని, ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, ప్రత్యేక అధికారి దివ్య చొరవ చూపడంతో ఇటీవల పాస్ బుక్ వచ్చిందన్నారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా రుక్మిణి ధన్యవాదాలు తెలిపారు.



తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

మూడేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు

తప్పిపోయిన బాలుడిని అప్పగించిన ఎస్‌కేసీవీ ట్రస్టు సభ్యులు

దోమ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం తప్పిపోయిన బాలుడిని విజయవాడకు చెందిన ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ ట్రస్టు వారు అతని తల్లిదండ్రులకు అప్పగించారు. దోమ గ్రామానికి చెందిన బొక్క బాబు, యాదమ్మల కుమారుడు భరత్‌కుమార్ పదేళ్ల వయసులో తప్పిపోయాడు. తల్లిదండ్రుల మధ్య మనస్పర్ధలు రావడంతో తల్లి వెంబడి భరత్‌కుమార్ హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ అతడు తప్పిపోయాడు. వారు నిరక్షరాస్యులు కావడంతో ఎలాంటి ఫిర్యాదు అందించలేదు. మూడేళ్ల క్రితం బాలుడు విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా కనిపించడంతో విజయవాడకు చెందిన ఎస్‌కేసీవీ సంస్థ ప్రతినిధులు ఆ బాలుడిని చేరదీశారు. కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో పిల్లలు తమ సొంత గ్రామం, తల్లిదండ్రుల పేర్లు తెలపడంతో వారి సొంత గ్రామానికి చేర్చి ప్రజాప్రతినిధులు, పోలీసుల ఆధ్వర్యంలో పిల్లలను అప్పజెబుతారు. ఈ క్రమంలో దోమ మండల కేంద్రానికి వచ్చిన ట్రస్టు ప్రతినిధులు శుక్రవారం భరత్ కుమార్‌ను తండ్రి బొక్క బాబుకు అప్పజెప్పారు. అదే విధంగా బాలుడిని ఏదైనా పాఠశాలలో చేర్పించాలని మాజీ సర్పంచ్ రాజిరెడ్డి కోరగా అందుకు వారు స్పందించి సంబంధిత అధికారుల ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలలో తండ్రి అనుమతితో చేర్పిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి ట్రస్టు సభ్యులను అభినందించారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



రైతులతో మాట్లాడుతున్న ఉమాశంకర్ ప్రసాద్

బొంరాస్‌పేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అందరూ సహకరించాలని తాండూరుసబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ కోరారు. శుక్రవారం దుద్యాల మండలంలోని పోలెపల్లిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూసేకరణ నిమిత్తం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ముందుకు వచ్చి తమ భూములను అప్పగిస్తే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఎకరాకు రూ.10లక్షలు, ఇంటి స్థలాలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పోలెపల్లి శివారులోని సర్వే నెం.67లో71ఎకరాల భూములకు సంబంధించి 35 మంది రైతులు కాస్తులో ఉన్నారు. అందులో ఇప్పటికే 15 మంది రైతులు ప్రభుత్వానికి భూములు అప్పగించినట్లు సమాచారం. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, దుద్యాల తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్, కొడంగల్ తహసీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

తాండూరు మహిళకు గ్లోబల్ అవార్డు

తాండూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగంలో పురుషులకు దీటుగా మేం ఏం తక్కువ కాదని మహిళలు నిరూపిస్తున్నారు. ఈక్రమంలోనే తాండూరుకు చెందిన ఉమాదేవి గ్లోబల్ ఇనిస్పిరేషన్ అవార్డు ఎంపికై ఆదర్శంగా నిలిచింది. తాండూరు పట్టణానికి చెందిన ఉమాదేవి జ్యూట్ పేరుతో వ్యాపార సంస్థను నిర్వహిస్తున్నారు. ఇందులో పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించేందుకు జ్యూట్ బ్యాగులను తయారు చేస్తూ వ్యాపారంలో రాణిస్తున్నారు. నిత్యావసరాలు, శుభకార్యాలకు ఉపయోగించుకునేందుకు వీలుగా జ్యూట్ బ్యాగులను ఆకర్షణీయంగా తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తున్నారు. అయితే ఢిల్లీలోని గ్లోబల్ ఉమెన్(జీడబ్ల్యూఐ) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాప్-100ఇనిస్పిరేషన్ అవార్డుకు ఉమాదేవి ఎంపికైంది. మహిళ తయారు చేస్తున్న జ్యూట్ బ్యాగుల తయారీని అభినందిస్తూ ఉమాదేవికి ఇనిస్పిరేషన్ అవార్డును ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం అందజేశారు.



మంత్రితో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

● మంత్రి కోమటిరెడ్డికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వినతి

శంషాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శంషాబాద్-షాబాద్ రోడ్డు నిర్మాణంతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన నగరంలో మంత్రిని కలిసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శంషాబాద్-షాబాద్ మండలాలను కలిపే ఈ రెండు లేన్ల రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా నిర్మిచేందుకు రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. గండిపేట నుంచి శంకర్ పల్లి వరకు ఉన్న నాలుగు వరసల రోడ్డును ఆరు వరసల రహదారిగా మార్చేందుకు రూ. 20కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండు నుంచి వయా రాళ్లగూడ నుంచి ఒయాసిస్ స్కూల్ వరకు జరుగుతున్న రోడ్డు పనులు ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఆర్‌డీసీఎల్ సంస్థలకు నిధులు మంజూరైనందున.. ఆ పనులు హెచ్ ఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో చేపట్టేందుకు ఆదే శాలు ఇవ్వాల్సిందిగా మంత్రి కోమటిరెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



డాక్టర్ రామ్‌రాజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి): శంషాబాద్ మండలంలోని ఘన్సిమి యాగూడలో ఇటీవల నిర్మించిన నూతన రోడ్డు కారణంగా.. ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు తప్పడం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు ఆనంద్ అన్నారు. ఈమేరకు సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం లిమ్స్ ఆసుపత్రి వైద్యుడు రామ్‌రాజ్‌ను కలిశారు. బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆయన్ను కోరారు. స్పందించిన రామ్‌రాజ్ నాలుగు బారికేడ్లు అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్‌ను వారు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తోక మల్లేశ్‌గౌడ్, జంగయ్య, రవీందర్‌గౌడ్, సదానందం, బాబు, రాజు, గుగ్గిళ్ల శ్రీనివాస్, శ్రీకాంత్, హసీన్, ఇమ్రాన్, ప్రభు, రజాక్, పాముల సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు లైట్లు.. పట్టించుకోని అధికారులు



తుమ్మలపల్లిలో పగటిపూట వెలుగుతున్న స్ట్రీట్ లైట్లు

చౌదరిగూడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులు, సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తు న్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు లేవు. మరికొన్ని చోట్ల స్విచ్‌లు లేక లైట్లు 24 గంటల పాటు వెలుగుతూనే ఉంటున్నాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకొని స్విచ్‌లు ఏర్పా టు చేసి సాయంత్రం ఆన్‌చేసి తెల్లవా రుజామున ఆఫ్ చేయాలని ప్రజలు కోరు తున్నారు.

నిధుల్లేవు.. పనులు కావు!

● పదేళ్లుగా ముందుకు సాగని సమావేశ మందిరం నిర్మాణం

● జిల్లా పరిషత్‌లో నిధుల కొరతే కారణం?



అసంపూర్తి పనులతో యాచారం మండల సమావేశ మందిరం

యాచారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సమావేశ మందిరం పనులు ముందుకు సాగడం లేదు. పనులు ప్రారంభించి పదేళ్లు అవుతున్నా అధికారులకు పట్టింపు లేకుండా పోయింది. పదేళ్ల క్రితం రూ.20లక్షల నిధులతో భవన నిర్మాణం ప్రారంభించారు. ఆ తర్వాత మరో రూ.30లక్షలు కేటాయించి భవనం పూర్తి చేయాలని అప్పట్లో జడ్పీటీసీలు కె.రమేష్‌గౌడ్, చిన్నోళ్ల జంగమ్మలు ఆనాటి జడ్పీ సీఈవోలకు విన్నవించారు. అయితే, జడ్పీలో నిధులు లేకపోవడంతోనే భవనం పూర్తి చేయలేకపోతున్నట్లు సమాచారం. భవనం పూర్తవడానికి ఇంకా ఎంత మేర నిధులు అవసరమవుతాయో ఎస్టిమేషన్ తయారు చేయాలని జడ్పీటీసీలు జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ, డీఈలకు సూచించినా ఫలితం లేకుండా పోయిందనే విమర్శలు న్నాయి. కాగా, భవనంలో మూత్రశాల, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు విజ్ఞప్తి కూడా చేశారు.

బీఆర్ఎస్ నేతలతో ప్రగతికి అడ్డుకట్ట



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చారిత్రక వైభవానికి ఆనవాలుగా ఉన్న మూసీ నది పునరుజ్జీవానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే బీఆర్ఎస్ నాయకులు అమాయక ప్రజలను రెచ్చగొడుతూ అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. ప్రగతిని అడ్డుకోవడమే బీఆర్ఎస్ నాయకులు దినచర్యలో భాగంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహులు మాట్లాడుతూ అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ ప్రజా పాలనపై విషం కక్కుతున్నారని అన్నారు. మూసీ మురికి కంటే ఎక్కువ విషాన్ని నింపుకున్న బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు మూసీ ప్రక్షాళన విషయంలో అసత్య ప్రచారాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. మూసీ కంపు నుంచి ప్రజల్ని, వరదల నుంచి నగరాన్ని కాపాడడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నది ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారని, ఈక్రమంలో నష్టపోయే ఏ ఒక్కరికీ ప్రభుత్వం అన్యాయం చేయకుండా చూస్తుందని, నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందిస్తుందని చెప్పారు. ప్రజలకు కాంగ్రెస్ మేలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక దుష్ప్రచారానికి ఒడిగట్టాయని, చెరువులు, కుంటలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కలిసి రావాల్సిన విపక్షాలు విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకొని దాచుకున్న బీఆర్ఎస్ నాయకులు నేడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు జగన్, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యసేవలు హర్షణీయం



మాచన్‌పల్లిలో అంగన్‌వాడీ భవనం ప్రారంభోత్సవంలో అమెజాన్ ప్రతినిధులు

షాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం కోసం అమెజాన్ వెబ్ సర్వీసెస్ కృషి చేయడం హర్షణీయమని తెలంగాణ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో ఇటీవల అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో సెర్ప్ మద్దతుతో చేపట్టిన అంగన్‌వాడీ భవన సుందరీకరణతో పాటు మాచన్‌పల్లి నల్లచెరువు కట్ట సుందరీకరణ, గ్రామంలో సోలార్ స్ట్రీట్‌లైట్లను ఏర్పాటు చేయగా శుక్రవారం ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, గోపాల్‌నాయక్, యాదయ్య అమెజాన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అఖిల్‌సాగర్, పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

నాగర్‌కుంట గ్రామానికి చెందిన అఖిల్ సాగర్ చెరువు, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరిచేందుకు అమెజాన్ సంస్థ సహకరించాలని నాగర్‌కుంట గ్రామస్తులు కోరారు. ఈమేరకు శుక్రవారం కంపెనీ ప్రతినిధులకు వారు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో మౌలిక వసతులు, వాటర్ ఫిల్టర్, గ్రంథాలయం ఏర్పాటుకు సంస్థ సహకరించాలని కోరారు. కాగా, అఖిల్‌సాగర్ చెరువులో గ్రామస్తులు చేపపిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, గ్రామస్తులు యాదయ్య, నర్సింహులు, రవి, రమేష్, జంగయ్య, చంద్రబాబు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ. 4.15 కోట్లు మంజూరు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగర శివారు మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గండిపేట చెరువు.. ఎన్టీఆర్ విద్య సంస్థల నుంచి గండిపేట వరకు రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.4.15 కోట్ల నిధులు మంజూరైనట్లు స్థానిక కాంగ్రెస్ నేతలు ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, రహదారి పనులను త్వరలో ప్రారంభం కానున్నట్లు వారు పేర్కొన్నారు. హిమా యత్‌నగర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దసరా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

యాచారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని బొంగులూరు గేటు వద్ద గల ప్రమిద కన్వెన్షన్ హాల్‌లో రేపు(ఆదివారం) నిర్వహించే దసరా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ యాచారం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.రమేష్‌గౌడ్, పి.బాషాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమ్మేళనానికి యాచారం మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. కేటీఆర్ హాజరవుతున్నారని వారు తెలిపారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేవైఎం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని భాస్కర ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులకు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆయన పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులతో కలిసి బీజేపీ సభ్యత్వాన్ని చేయించారు. అనంతరం దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పలువురు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

‘సీసీ’తో తొలగిన ఇబ్బందులు

● బల్సులపల్లి-చింతలపల్లి గ్రామస్తుల హర్షం



ప్రధాన రహదారి నుంచి బల్సులపల్లి రోడ్డులో వేస్తున్న సీసీ

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపల్లి నుంచి బల్సులపల్లి వెళ్లే రోడ్డులో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఆమనగల్లు-తలకొండపల్లి రోడ్డును ఇటీవల ఆధునికీకరించారు. కాగా, చింతలపల్లి నుంచి బల్సులపల్లికి వెళ్లే రోడ్డు వద్ద ఎత్తు ఎక్కువై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ప్రధాన ర హదారి నుంచి బల్సులపల్లి కి వెళ్ళే రోడ్డును చదును చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను చింతలపల్లి, బల్సులపల్లి గ్రామస్తులు కోరుతూ వస్తున్నారు. ఈక్రమంలో రోడ్డు కాంట్రాక్టర్ శుక్రవారం ప్రధాన రహదారి నుంచి కింది వైపు వెళ్లడానికి వీలుగా సీసీ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ప్రమాదాలకు చోటు లేకుండా సీసీ నిర్మాణం ఎత్తు పెంచి చదును చేయించారు. ఈ సందర్భంగా బల్సులపల్లి-చింతలపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సామాజిక సేవలో లయన్స్‌క్లబ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేందర్ కుమార్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి): సామాజిక సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ జి.మహేందర్ కుమార్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రంగనాయకమ్మ స్మారకార్థం లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డితో కలిసి మహేందర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వారు అన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా కో-ఆర్డినేటర్ కసిరెడ్డి రాంరెడ్డి, జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్, కడ్తాల మాజీ సర్పంచ్ వేణుగోపాల్, కార్యదర్శి మహేశ్, పీఆర్వో ఎంఏ పాషా, సభ్యులు రాజేందర్, అంజయ్య, గంప శ్రీను, పిప్పళ్ల వెంకటేశ్, గోవర్ధన్‌రెడ్డి, కుమార్, లక్ష్మయ్య, తదితరులున్నారు.

21న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 21న స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్వో ఎంఏ పాషలు తెలిపారు. ఆమనగల్లు మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా సురేష్



షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన గందె సురేష్ గుప్త ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ శుక్రవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. అధ్యక్ష పదవి కోసం గందె సురేష్‌తో పాటు షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన బెజ్జుగం రమేష్, సారాపు జగదీశ్వర్, ఆగీరు రవికుమార్, సారాపు రమేష్, ఎం. శ్రీనివాస్‌లు నామినేషన్లు వేశారు. జిల్లా అధ్యక్ష పదవిని ఏకగ్రీవం చేయాలని ఆర్యవైశ్య సంఘం పెద్దల జోక్యంతో పోటీపడిన ఆరుగురు తమ నామినేషన్ల ఉప సంహరణ పత్రాలను ఇస్తూ, ఆరుగురులో ఎవరిని ఎన్నిక చేసినా సమ్మతమేనని అంగీకార పత్రాలను రాష్ట్ర అధ్యక్షుడికి ఇచ్చారు. దాంతో గందె సురేష్‌ను అధ్యక్షుడిగా ఎన్నిక చేసినట్టు రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ప్రకటించారు.

కడ్తాలలో సహకార బ్యాంకు ఏర్పాటు చేయాలని వినతి



రవీందర్‌రావును సన్మానిస్తున్న గంప వెంకటేశ్

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డితో రవీందర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. కడ్తాల మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందజేసినట్లు వెంకటేశ్ తెలిపారు. బ్యాంక్ ఏర్పాటు వల్ల రైతులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. డీసీసీబీ ద్వారా త్వరలో నెట్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ మేనేజింగ్ కమిటీ సంసిద్ధంగా ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు



కంకర వేసి వదిలిపెట్టిన ఎక్లాస్‌ఖాన్‌పేట- వేముల్‌నర్వ రోడ్డు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కేశంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వేముల్‌నర్వ-ఎక్లాస్‌ఖాన్‌పేట మార్గమధ్యలో కంకర వేసి బీటీ మరిచారు. దాంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బైర్కాన్‌పల్లి నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేట, వేముల్‌నర్వ, చింతకుంటపల్లి మీదుగా కొండారెడ్డిపల్లి పంచాయతీ రోడ్డు వరకు దాదాపు 10కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణం కొరకు టెండర్లు పిలిచింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మొదట బైర్కాన్‌పల్లి నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేట వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అలాగే ఎక్లాస్‌ఖాన్‌పేట శివారు వరకు వేముల్‌నర్వ మార్గంలో బీటీ రోడ్డు వేశారు. ఎక్లాస్‌ఖాన్‌పేట శివారు నుంచి వేముల్‌నర్వ గ్రామం వరకు 2కిలోమీటర్ల వరకు కంకర పరిచి వదిలేశారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. రైతులు వారు పండించిన కూరగాయలు, పంటలు తరలించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా కంకర రోడ్డుపై ప్రయాణాలు కొనసాగుతున్నా అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి బీటీ రోడ్డును పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే బీటీ రోడ్డు పూర్తిచేయాలి



ఎక్లాస్‌ఖాన్‌పేట శివారు నుంచి వేముల్‌నర్వ వరకు వెంటనే బీటీ రోడ్డు వేయాలి. రోడ్డుపై వేసిన కంకరతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నాం. ద్విచక్రవాహనాలు నడపలేకపోతున్నారు. కార్లు, జీపులు వెళ్తున్నప్పుడు కంకర రాళ్లు ఎగిరి పడుతున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి బీటీ రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి.

- యాచవరం జనార్దన్‌రెడ్డి, వేముల్‌నర్వ

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

యాచారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. శుక్రవారం సాయంత్రం యాచార పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్లిపల్లి గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. దేవరకొండకు చెందిన తుపాకుల మల్లేష్(37) పిల్లిపల్లి సమీపంలోని గూగి వెంచర్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బైక్‌పై నానక్‌నగర్ వైపు నుంచి వెంచర్‌కు వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన అద్దె బస్సు (టీఎస్ 07 వీజీ 0688) బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దాంతో మల్లేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

మహేశ్వరం అభివృద్ధికి ప్రత్యేక కృషి

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



కేఎల్లార్‌ను కలిసిన హర్షగూడ కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్ల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కలతో చర్చించగా ముందుగా రూ.17 కోట్లు మంజూరు చేశారని, త్వరలో మరిన్ని నిధులు విడుదలవుతాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు, బ్రిడ్జీల నిర్మాణానికి నిధులను ఉపయోగించనున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గానికి రూ.17 కోట్ల నిధులు మంజూరు కావడం హర్షణీయమన్నారు. నూతనంగా తుక్కుగూడ మున్సిపాలిటీలో విలీనమైన హర్షగూడ గ్రామ రోడ్డు పనులను కూడా వెంటనే ప్రారంభించేలా చూస్తానన్నారు. ఫోర్త్‌సిటీ, ఫార్మా, మెట్రోకారిడార్, విద్య, వైద్యహబ్‌ల ఏర్పాటుతో మహేశ్వరం మహానగరంగా మారనుందన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటువేసి గ్రామాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేస్తుందన్నారు. పదేళ్లుగా నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనం వృథా చేసి అవినీతికి పాల్పడ్డ సబితాఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే కనీస అర్హతకూడా సబితారెడ్డికి లేదన్నారు. కాగా, అంతకుముందు హర్షగూడకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయన్ను తుక్కుగూడలోని కార్యాలయంలో కలిసి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవినాయక్, రాజునాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి నాయకుల సన్మానం



మహేశ్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న నర్సింహగౌడ్, నారాయణ

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను శుక్రవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎండపల్లి నారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గౌని నర్సింహగౌడ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. గాంధీభవన్‌లో మహేశ్ కుమార్‌ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగంపల్లిలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా డాక్టర్ అగ్నివేశ్ ప్రారంభించారు. గ్రామంలో 168 ఆవులు, 24 గేదెలకు టీకాలు వేసినట్లు ఆయన చెప్పారు. రైతులందరూ ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అగ్నివేశ్ కోరారు. పశు వైద్య సిబ్బంది సులేమాన్, యాదయ్య, బురానొద్దీన్, పాలాక్ష, గోపాలమిత్రలు హరీశ్, రమేశ్, ప్రకాశ్, తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ కోరారు. శుక్రవారం ఈమేరకు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రాష్ట్రంలో రూ.7,500 కోట్లకు పైగా ఫీజు రీయిబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయిలున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. డిగ్రీ, పీజీ పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఒత్తిడికి గురిచేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు కిషోర్, విజయ్, ప్రశాంత్, శివకుమార్, అఖిల, ప్రవళిక, సంధ్య పావని, భాను తదితరులున్నారు.

జోరుగా తపస్ సభ్యత్వ నమోదు

కడ్తాల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయుఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించింది. తపస్ మండలాధ్యక్షుడు సంతోష్‌కుమార్, గౌరవాధ్యక్షుడు భాస్కర్‌లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి తపస్ రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. ఉపాధ్యాయుల పెండి ంగ్ డీఏలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, పీఆర్సీ ప్రకటించాలని, బకాయిలను విడుదల చేయాలని కోరారు. పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయుల జూలై జీతం బకాయిలను విడుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రముఖ్ సుమరంజిత, సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సంతోష్‌కుమార్, భాస్కర్